https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

1 PM TO 4 PM

సంపుటి: 01 / సంచిక:21 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / ఆదివారం, సెప్టెంబర్ 06,2026

## డీజీపీని ఉద్దేశిస్తూ

# ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత

- కవితపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్
- కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారని కవిత మండిపాటు
- కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరిక



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్06

తనపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్‌ను కేవలం సస్పెండ్ చేసి సరిపెట్టారంటూ తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలను దూషిస్తే మూడేళ్ల జైలు శిక్ష పడే చట్టాలు ఉన్నప్పటికీ పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని, సదరు కానిస్టేబుల్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రభుత్వ పరువు తీస్తానని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, "డీజీపీ గారికి ఇద్దరు కోడళ్లు ఉన్నారు. వారిపై ఇలాగే కామెంట్లు చేస్తే ఊరుకుంటారా? నాలాంటి ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఈ డీజీపీ బాధ్యతలు స్వీకరించాకే క్రైమ్ రేటు పెరిగిందని, గంజాయి విక్రయాలపై సిగ్గుచేటు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.ఎన్నికలకు ముందు తెలంగాణ ఉద్యమకారుల కాళ్లు పట్టుకున్న రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మూడేళ్ల పాలనలో వారిని పూర్తిగా విస్మరించారని కవిత ధ్వజమెత్తారు. ఉద్యమకారుల్లో ఉన్న నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని, ఇక మిగిలింది ఆమరణ దీక్ష మాత్రమేనని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే ఉద్యమకారుల సంక్షేమంపై స్పష్టమైన గడువుతో కూడిన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని తప్పుడు లెక్కలు చూపిన కాంగ్రెస్, ఇప్పుడు బీసీల కోసం ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## బుర్ర ఉందిగా రేవంత్ రెడ్డి ఆలోచించు..

### పాలిటెక్నిక్ విద్యార్థిని ఫైర్..



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్06

పాలిటెక్నిక్ విద్యను ఆగం చేసేందుకు రేవంత్ సర్కార్ తీసుకొచ్చిన జీవో 97ను వెంటేనే రద్దు చేయాలని పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కొనసాగిస్తున్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొణింటి మానిక్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కాంగ్రెస్ విఫలపాలనపై నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఓ పాలిటెక్నిక్ విద్యార్థిని సీఎం రేవంత్ రెడ్డిపై ఫైర్ అయ్యింది. నువ్ ఫాంహౌస్ నుంచి బయటకు రా అని కేసీఆర్ మీద పడి ఏడవడం కాదు.. మాకు స్కాలర్‌షిప్ ఇస్తావా లేదా? మేం పేద బిడ్డలం.. ఆడబిడ్డలం.. రేవంత్ రెడ్డికి చెప్తున్నా మా ఉసురు నీకు తగులుతది.. ఖబడ్దార్ రేవంత్ రెడ్డి అని హెచ్చరించింది.ఈ స్టేజీపై నుంచి నేను నీకు సవాల్ చేస్తున్నా. మేమందరం ఉన్నం.. అందరం ఒక పిడికిలాగా ఉన్నం.. నువ్వెనివయ్యా.. ఎవడున్నడు నీ వెంట.. రాహుల్ గాంధీ ఉన్నడా రమ్మను. స్టూడెంట్స్ అంతా ఉన్నం.. మేమనుకుంటే చేయలేమా..? ఏమన్నా.. మేం మా క్లాసులు వదిలిపెట్టుకొని వస్తున్నమంటే ఆలోచించు బుర్రుంది కదా.. ఇచ్చిండు కదా దేవుడు.. గుర్తు పెట్టుకో రేవంత్ రెడ్డి నువ్వు గనుక ఫీజు రీయింబర్స్ మెంట్ చేయకపోతే నీ ఇంటి ముందుకొచ్చి చేస్తం ధర్నా.. జాగ్రత్తగా ఉండు రేవంత్ రెడ్డి అని హెచ్చరించింది. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

# అక్టోబర్ లో మాల విద్యార్థి నిరుద్యోగుల రణభేరి



హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్06

రిజర్వేషన్లు, రోస్టర్ విధానంలో మాల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు జరుగుతున్న నష్టాలను పరిష్కరించి న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ మొదటి వారంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాష్ట్రస్థాయి మహాసభ నిర్వహించనున్నట్లు మాల స్టూడెంట్ జేఏసీ, అంసా, ఐక్య విద్యార్థి సంఘాల ప్రతినిధులు ప్రకటించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.రాష్ట్రంలో ఇటీవల వెలువడిన 25 ఉద్యోగ నోటిఫికేషన్లను పరిశీలిస్తే రోస్టర్ విధానం వల్ల మాల వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని ప్రతినిధులు ఆరోపించారు. ఇందులో సుమారు 19 నోటిఫికేషన్లలో ఒక్క పోస్టు కూడా దక్కని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. విద్య, ఉద్యోగాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ ప్రయోజనాలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఓయూ ఆర్ట్స్ కళాశాల వేదికగా కొద్దిమంది విద్యార్థి నాయకులతో ప్రారంభమైన తమ పోరాటానికి ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మందికిపైగా విద్యార్థులు, నిరుద్యోగుల మద్దతు ఉందని నిర్వాహకులు తెలిపారు. ఉద్యమాన్ని అన్ని జిల్లాలు, మండలాలు, నియోజకవర్గ కేంద్రాలకు విస్తరించేందుకు రౌండ్‌టేబుల్ సమావేశాలు, సన్నాహక సమావేశాలు, ప్రెస్‌మీట్లు నిర్వహించాలని నిర్ణయించారు.అక్టోబర్ మొదటి వారంలో ఆదివారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలో 'మాల విద్యార్థి నిరుద్యోగుల రణభేరి' పేరుతో నిర్వహించే మహాసభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, యువత, మాల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మాల స్టూడెంట్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్, వైస్ చైర్మన్ పండుగ భానుతేజ, మాల స్టూడెంట్ జేఏసీ నాయకులు మద్దెల రాజు, బత్తుల రమేష్, దిలీప్, అంసా ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, అంసా గ్రేటర్ హైదరాబాద్ నాయకుడు చిక్కుడు వెంకట్, ఏనపోతుల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు కోతలకు నిరసనగా జాతీయ రహదారిపై ధర్నా

మక్తల్ : ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్06

వర్షాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు విద్యుత్ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మక్తల్ రైతులు మినీ ట్యాంక్ బండ్ వద్ద జాతీయ రహదారిపై ధర్నా కు దిగారు.ఆదివారం మక్తల్ మండల పరిధిలోని మంతన్ గౌడ్ సబ్ స్టేషన్ ఫీడర్ లో విద్యుత్ లో వోల్టేజీ సమస్యతోపాటు, సక్రమంగా విద్యుత్ రాక చేతికి వచ్చిన వరి పంట ఎండిపోయే పరిస్థితి వచ్చిందని మంతన్ గౌడ్, రుద్రసముద్రం, కాత్రేవపల్లి, కాచ్ వార్, దండు, గొల్లపల్లి, టేకులపల్లి గ్రామాల రైతులు ఆందోళన నిర్వహించారు.ఈ ధర్నాకు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మద్దతు తెలిపి రైతుల ఆందోళనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ సమస్య పరిష్కరించేందుకు సంబంధిత ఎస్ఈ తో మాట్లాడారు.మండలంలో వ్యవసాయానికి కరెంట్ కష్టాలు లేకుండా చూడాలని, బోర్ల వద్ద సాగు చేసుకున్న రైతుకు 100 శాతం దిగుబడి వచ్చే విధంగా, నిరంతరం కరెంటు సరఫరా అందించాలని కోరారు. జాతీయ రహదారిపై ధర్నాతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.



# హైదరాబాద్‌లో ట్రాన్స్‌జెండర్ల ఆగడాలపై డీజీపీ సీవీ ఆనంద్ సీరియస్

- ట్రాన్స్‌జెండర్ల బలవంతపు వసూళ్లపై స్పెషల్ డ్రైవ్‌కు డీజీపీ ఆదేశం
- గతంలోనూ ఇలాంటి దందాలను అరికట్టామని వెల్లడి
- చింతల్‌లో గృహప్రవేశం వద్ద రూ. 50 వేలు డిమాండ్ చేసిన ఘటన వైరల్
- ప్రభుత్వ ప్రోత్సాహంతో పలువురు ట్రాన్స్‌జెండర్లు మంచి పేరు తెచ్చుకున్నారని ప్రశంస
- అన్ని కమిషనరేట్ల పరిధిలో తనిఖీలు చేపట్టాలని పోలీసులకు సూచన

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్06



కొందరు ట్రాన్స్‌జెండర్లు శుభకార్యాల వద్ద బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలపై తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి బెదిరింపులు, దోపిడీలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ప్రత్యేక డ్రైవ్ (స్పెషల్ డ్రైవ్) చేపట్టాలని అన్ని కమిషనరేట్ల సీపీలను ఆదేశించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇటీవల హైదరాబాద్‌లోని చింతల్‌లో ఓ గృహప్రవేశ వేడుకలో ట్రాన్స్‌జెండర్లు రూ. 50,000 డిమాండ్ చేసిన ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయిన నేపథ్యంలో డీజీపీ ఈ ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.సెప్టెంబర్ 4న చింతల్ ప్రాంతంలో ఓ కుటుంబం తమ నూతన గృహంలోకి ప్రవేశించేందుకు రాగా, కొందరు ట్రాన్స్‌జెండర్లు వారిని అడ్డుకున్నారు. ఇంట్లోకి వెళ్లాలంటే రూ. 50,000 ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని బాధితులు చెప్పినా వినకుండా అసభ్యంగా ప్రవర్తించి, శాపనార్థాలు పెట్టారని బాధితురాలు వీడియో ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించడంతో, ఇలాంటి వసూళ్ల దందాలపై కఠిన చర్యలు తీసుకోవాలని నెటిజన్లు పోలీసులను కోరారు.ఈ ఘటనపై స్పందించిన డీజీపీ సీవీ ఆనంద్, ఇటీవల కాలంలో ఇలాంటి ఫిర్యాదులు తన దృష్టికి వస్తున్నాయని అంగీకరించారు. తాను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు కూడా ఇలాంటి బెగ్గింగ్ రాకెట్లు, బలవంతపు వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నియంత్రించినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.అదే సమయంలో, ట్రాన్స్‌జెండర్ల జీవనోపాధికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని డీజీపీ ప్రస్తావించారు. ప్రభుత్వ చొరవతో ఎందరో ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా, ఇతర విభాగాల్లో ఉద్యోగాలు పొంది ఎలాంటి ఫిర్యాదులు లేకుండా మంచి పేరు తెచ్చుకుంటున్నారని ఆయన వివరించారు.

# సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం..

## పట్టాలు తప్పిన మహానంద ఎక్స్‌ప్రెస్

పాట్నా: ట్రినెట్ న్యూస్, సెప్టెంబర్06

సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం వల్ల మహానంద ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. రైలు ఇంజిన్, రెండు బోగీలు పట్టాలు తప్పాయి. రైల్వే అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ సంఘటన వల్ల ఆ రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 15483 అలీపుర్దువార్ జంక్షన్-ఢిల్లీ సిక్కిం మహానంద ఎక్స్‌ప్రెస్ ట్రైన్ ఆదివారం ఉదయం 4.12 గంటలకు బీహార్‌లోని ఆరా రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ రెండుకు చేరుకున్నది.కాగా, ఢిల్లీ వెళ్లాల్సిన ఆ రైలు స్టేషన్ నుంచి బయలుదేరిన సమయంలో సిగ్నల్ వ్యవస్థలో సాంకేతిక సమస్య వచ్చింది. దీంతో ససారం అప్ లైన్ వైపు సిగ్నల్ చూపించడంతో ఆ రైలు ముందుకు కదిలింది. అయితే స్టేషన్‌కు సుమారు 200 మీటర్ల దూరంలో అది పట్టాలు తప్పింది. రైలు ఇంజిన్, ఎస్ఎల్ఆర్, హెచ్-1 కోచ్ పట్టాలు తప్పాయి. ఈ సంఘటన వల్ల ఆ మార్గంలో రైళ్ల రాకపోకలతకు అంతరాయం ఏర్పడింది.మరోవైపు ఈ సమాచారం తెలిసిన వెంటనే రైల్వే అధికారులు, సాంకేతిక బృందాలు, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పట్టాలు తప్పిన రైలు ఇంజిన్, బోగీలను ట్రాక్‌పైకి ఎక్కించే పునరుద్ధరణ పనులు చేపట్టారు.ససారం లైన్ వైపు సిగ్నల్ మళ్లడానికి దారితీసిన పరిస్థితులు, ఆ రైలు తప్పుడు దిశలో ఎలా ప్రయాణించిందనే దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని రైల్వే అధికారులు తెలిపారు.



# కూకటిపల్లి కాంగ్రెస్ నేతల మధ్య ఫ్లెక్సీల వార్..

ట్రినెట్ న్యూస్, సెప్టెంబర్06

కాంగ్రెస్ అంటేనే గ్రూప్ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. గల్లీ అయినా.. ఢిల్లీ అయినా కుర్చీల కోసం, ఫ్లెక్సీల కోసం పంచాయతీ పెట్టుకోవాల్సిందే. తాజాగా కాంగ్రెస్ పార్టీలో మరోసారి వర్గపోరు బయటపడ్డది. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీలో ఫ్లెక్సీల గొడవ రాజుకుంది. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి కూకట్ పల్లి వై జంక్షన్ వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే స్థానిక నాయకుల ఫోటోలను పెట్టకుండా, శేరి సతీష్ రెడ్డి ఫోటోతో అనుచరులు ఫ్లెక్సీలు పెట్టడంతో వివాదం చెలరేగింది.కాంగ్రెస్ పార్టీ నుండి బహిష్కరించిన తర్వాత కూడా శేరి సతీష్ రెడ్డి ఫ్లెక్సీలు ఎలా పెడతారంటూ ఓ వర్గం గొడవకు దిగింది. ఈ క్రమంలో ఫ్లెక్సీలు కాంగ్రెస్ నేతలు చింపి వేయగా.. ఇరు వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. వెంటనే రంగంలోకి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఫ్లెక్సీలను చింపేసిన కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.



# ఓటర్లకు డబ్బు పంచకుండా నా సవాల్ స్వీకరిస్తావా?

## : పెద్దారెడ్డికి జేసీ ప్రభాకర్ రెడ్డి సవాల్

తాడిపత్రిలో మరోసారి వేడెక్కిన రాజకీయం

వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పెద్దారెడ్డికి జేసీ సవాల్

చెరో రూ. 10 కోట్లు తాడిపత్రి అభివృద్ధికి ఖర్చు చేద్దామని ప్రతిపాదన

ట్రినెట్ న్యూస్, సెప్టెంబర్06



అనంతపురం జిల్లా తాడిపత్రి రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి లక్ష్యంగా టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేస్తూ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధం కావాలని హెచ్చరించిన ఆయన... గత ఐదేళ్ల వైసీపీ పాలనలో తాడిపత్రిలో మట్కా, బెట్టింగ్, గంజాయి దందాలు విచ్చలవిడిగా సాగాయని ఆరోపించారు. బీఎస్-3 వాహనాల కుంభకోణంతో పాటు అక్రమ సంపాదనకు అలవాటు పడి తాడిపత్రి ప్రాంత అభివృద్ధిని కేతిరెడ్డి పూర్తిగా నాశనం చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఈ విమర్శలతో పాటు జేసీ ప్రభాకర్ రెడ్డి ఓ ఆసక్తికరమైన సవాల్‌ను కేతిరెడ్డి ముందుంచారు. రాబోయే ఎన్నికల్లో ఓటర్లకు పైసలు పంచే సంస్కృతికి స్వస్తి పలికి, ఇద్దరం చెరో రూ. 10 కోట్ల చొప్పున మొత్తం రూ. 20 కోట్లు తీసి తాడిపత్రి పట్టణాభివృద్ధికి ఖర్చు చేద్దామని ప్రతిపాదించారు. "నా సవాల్‌ను స్వీకరించే ధైర్యం, తాడిపత్రిపై నిజమైన ప్రేమ నీకు ఉందా పెద్దారెడ్డి?" అని సూటిగా ప్రశ్నించారు.

# ఈశ్వర్ సాయి వ్యవహారం..

## ఆత్మహత్యాయత్నం చేసిన ఫోక్ డ్యాన్సర్ మాధురి రాథోడ్!

జానపద కళాకారిణి మాధురి రాథోడ్ ఆత్మహత్యాయత్నం


న్యాయం జరగడం లేదనే మనస్తాపంతో ఈ తీవ్ర నిర్ణయం

గాయకుడు ఈశ్వర్ సాయిపై గతంలో పోలీసులకు ఫిర్యాదు

పరారీలో ఉన్న ఈశ్వర్ సాయి.. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్

మాధురిపై ఈశ్వర్ సాయి భార్య కూడా పోలీసులకు ఫిర్యాదు

ట్రినెట్ న్యూస్, సెప్టెంబర్06



ప్రముఖ జానపద కళాకారిణి మాధురి రాథోడ్ ఆత్మహత్యకు యత్నించడం తీవ్ర కలకలం రేపింది. మరో జానపద గాయకుడు ఈశ్వర్ సాయిపై తాను చేసిన ఫిర్యాదు విషయంలో న్యాయం జరగడం లేదన్న తీవ్ర మనస్తాపంతో ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించగా, కుటుంబసభ్యులు సకాలంలో గమనించి, తలుపులు పగలగొట్టి ఆమెను రక్షించారు. ఈశ్వర్ సాయి తనను పెళ్లి పేరుతో మోసం చేసి, శారీరకంగా వాడుకుని, ఆ తర్వాత వేధించాడని మాధురి రాథోడ్ గతంలోనే హైదరాబాద్‌లోని నర్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా, ఏఐ టెక్నాలజీతో మార్ఫింగ్ వీడియోలు సృష్టించి తన పరువుకు భంగం కలిగించాడని ఆమె తన ఫిర్యాదులో ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈశ్వర్ సాయిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 69 కింద కేసు నమోదు చేశారు. అయితే, అతను పరారీలో ఉన్నాడని పోలీసులు చెబుతుండగా, అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు ఈశ్వర్ సాయి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం.పోలీసులు ఈశ్వర్ సాయిని అరెస్ట్ చేయకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, తనకు న్యాయం జరగడం లేదనే ఆవేదనతోనే మాధురి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు.ఇదే వ్యవహారంలో మరో కోణం కూడా ఉంది. ఈశ్వర్ సాయి భార్య శరణ్య, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పోలీస్ స్టేషన్‌లో మాధురిపై ఫిర్యాదు చేశారు.

# ఇరాన్‌లో ఆయిల్ ట్యాంకర్ పేలుడు..

## 11 మంది మృతి.. ఏడుగురికి గాయాలు



ట్రినెట్ న్యూస్, సెప్టెంబర్06

ఇరాన్‌లో భారీ పేలుడు సంభవించి 11 మంది మరణించగా, ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన పశ్చిమ ఇరాన్, కుర్దెస్తాన్ ప్రావిన్స్‌లోని సనందాజ్ కౌంటీని, హమేదాన్ ప్రావిన్స్‌లోని హమేదాన్ కౌంటీని కలిపే రోడ్డు మార్గంలో జరిగింది. ఈ ఘటన విషయంలో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ రోడ్డు మార్గంలో ఆయిల్ ట్యాంకర్ వెళ్తుండగా బ్రేక్స్ ఫెయిలయ్యాయి. దీంతో ఆయిల్ ట్యాంకర్.. దాని ముందున్న వాహనాలను ఢీకొంది. ఈ క్రమంలో ఆయిల్ ట్యాంకర్ పేలి, మంటలు చెలరేగాయి. పక్కనే ఉన్న కార్లతోపాటు, ఇతర వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో భారీ పేలుడు జరిగి, ఆ వాహనాల్లోని 11 మంది మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు అక్కడికి చేరుకుని క్షతగాత్రుల్ని సనందాజ్‌లోని ఆస్పత్రులకు చికిత్స కోసం తరలించారు.ఈ పేలుడు కారణంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కూడా స్తంభించింది. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బ్రేకులు ఫెయిల్ అవ్వడం కారణంగానే ఈ పేలుడు జరిగిందని భావిస్తున్నారు. ప్రస్తుతం దీనిపై విచారణ జరుగుతోంది. ఆ తర్వాతే పూర్తి వివరాలు తెలుస్తాయి. మృతులకు సంబంధించిన వివరాలు కూడా తెలియాల్సి ఉంది.

# ప్రధాని మోదీకి బెల్జియం ప్రధాని ఇవ్వాలనుకున్న గిఫ్ట్




ట్రినెట్ న్యూస్, సెప్టెంబర్06


భారత ప్రధాని నరేంద్ర మోదీ కోసం బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ప్రత్యేకంగా 'ఇండియా గేట్ ' ఆకృతిలో ఉన్న చాక్లెట్‌ను తయారు చేయించారు. అయితే అది భారత్‌కు తీసుకొచ్చే క్రమంలో మార్గమధ్యలోనే కరిగిపోయి పాడైంది. దాంతో బెల్జియం ప్రధాని ఆ చాక్లెట్‌ను ప్రధానికి ఇవ్వలేకపోయారు. ఈ క్రమంలో భారత్‌లో బెల్జియం దౌత్యకార్యాలయం తాము తయారు చేయించిన 'ఇండియా గేట్ చాక్లెట్' చిత్రాన్ని ఎక్స్ వేదికగా పంచుకుంది. భారత్ పర్యటన సందర్భంగా మోదీకి ఈ వినూత్న కానుకను అందించాలని వెవర్ భావించారు. అయితే భారత్‌కు తీసుకొస్తుండగా కరిగిపోవడంతో అందించలేకపోయారు. మరో ప్రతిరూపం బెల్జియంలో సిద్ధంగా ఉందని, దానిని ఎలాగైనా సురక్షితంగా మోదీకి అందిస్తానని ఆయన చెప్పారు.'ఇండియా గేట్‌ను అత్యుత్తమ బెల్జియం చాక్లెట్లతో రూపొందించి మోదీకి కానుకగా ఇవ్వాలని అనుకున్నా. అసలైన ఇండియా గేట్ చెక్కు చెదరకుండా ఉంది. కానీ చాక్లెట్‌తో చేసిన ప్రతిరూపం భారత్‌కు చేరుకునేలోపే పాడైంది' అంటూ వెవర్ సరదాగా వ్యాఖ్యానించారు. తొలి ప్రపంచ యుద్ధ సమయంలో బెల్జియంలో పోరాడిన భారత సైనికుల త్యాగానికి గుర్తుగా ఇండియా గేట్‌ను నిర్మించారు.

# ఢిల్లీలో కుప్పకూలిన భవనం..

## శిథిలాల కింద పలువురు


ట్రినెట్ న్యూస్, సెప్టెంబర్06

దేశ రాజధాని ఢిల్లీలో ఘోర ప్రమాదం జరిగింది. ఒక భవనం కుప్పకూలడంతో, ఆ శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. ఢిల్లీలోని సత్యనికేతన్ ప్రాంతంలో, ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఈ ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే ఢిల్లీ ఫైర్ డిపార్ట్‌మెంట్‌కు, పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు.ఫైర్ సిబ్బంది, పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. బిల్డింగ్ శిథిలాల కింద పలువురు చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ఆ శిథిలాల కింద ఎంతమంది ఉన్నారు అనే విషయంలో స్పష్టత లేదు. ప్రాథమిక అంచనా ప్రకారం శిథిలాల కింద ఐదుగురు ఉండొచ్చని అనుమానిస్తున్నారు. బిల్డింగ్ కూలడానికి గల కారణాలపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. కొద్ది రోజులుగా ఢిల్లీని భారీ వర్షాలు ముంచెత్తిన సంగతి తెలిసిందే.వర్షాలు కూడా బిల్డింగ్ కూలడానికి ఒక కారణం అయ్యుండొచ్చని అంచనా. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతాయి. ఘటనా స్తలంలో అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు సిద్ధంగా ఉన్నాయి. ఘటన జరిగిన ప్రదేశం ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌కు దగ్గర్లోనే ఉంది. ఘటనపై సమాచారం అందుకున్న పలువురు విద్యార్థులు కూడా సహాయక చర్యల్లో సాయం అందిస్తున్నారు.



# జేఎన్‌యూలో లైంగిక వేధింపులు..

## ప్రొఫెసర్‌పై ఫిర్యాదు చేసిన 10 మంది విద్యార్థినులు



ట్రినెట్ న్యూస్, సెప్టెంబర్06

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో లైంగిక వేధింపుల ఆరోపణలు సంచలనం రేపుతున్నాయి. ఒక ప్రొఫెసర్ తమను లైంగిక వేధింపులకు గురి చేసినట్లు 10 మంది విద్యార్థినులు యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. యూనివర్సిటీ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ (ఐసీసీ) వద్ద విద్యార్థినులు ఫిర్యాదు చేయగా.. విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది.ఈ ఫిర్యాదు ప్రకారం.. ఒక ప్రొఫెసర్ తన విద్యార్థినుల్ని ప్రైవేట్ మీటింగ్ కోసం తన ఇంటికి రమ్మని పిలిచేవాడు. అలాగే, అక్కడ విద్యార్థినులతో అభ్యంతరకరంగా ప్రవర్తించేవాడు. క్లాస్ రూంలో పాఠాలు చెబుతున్నప్పుడు కూడా అసభ్యకరమైన మాటలు మాట్లాడేవాడు. దీంతో ఈ వేధింపులను కొంతకాలం భరించిన విద్యార్థినులు నెల రోజుల క్రితమే ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై ప్రస్తుతం యూనివర్సిటీ అధికారులు విచారణ జరుపుతున్నారు.ఈ అంశంపై పోలీసులకు ఫిర్యాదు చేశారా.. లేదా అనే విషయాలు తెలియవు. అలాగే, విచారణలో ఏం తేలింది.. సంబంధిత ప్రొఫెసర్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నారు అనే విషయంలో కూడా యూనివర్సిటీ అధికారులు స్పష్టతనివ్వాల్సి ఉంది. ఈ అంశంపై కమిటీతోపాటు, పూర్వ విద్యార్థులు కూడా దృష్టిసారించినట్లు తెలుస్తోంది.